
# మట్టి



కప్పగంతుల మల్లికార్జునరావు

**సూర్యుడు** అస్తమించక ముందే చీకటి పడినట్లున్నది వాతావరణం. నల్లటి మబ్బులు మృత్యు దూతల్లా ఆకాశంలో కవాతు చేస్తున్నాయి.

వర్షం రాక ముందే ఇల్లు చేరుకోవాలని సైకిలును స్పీడుగా తొక్కుతున్నాడు లక్ష్మీపతి. ఒక ఇంటి ముందు జనం గుంపుగా మూగి ఉంటే టక్కున బ్రేకు వేసి సైకిలు దిగాడు. లోపలి దృశ్యాన్ని చూచాడు.

ఒక మనిషి శవం మీద పడి అతని భార్య, పిల్లలు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. వారినీ వీరినీ విచారించి వాస్త వివరాలు తెలుసుకున్నాడు.

చనిపోయిన వ్యక్తి ఇటీవలే ఆ వూరికి బదిలీ అయి వచ్చాడు. ఆ ఇంట్లో అద్దె కుంటున్నాడు. యాభై లోపు వయసు ఉన్న అతనికి ఆరోజు మధ్యాహ్నం మూడు గంటలకి ఆఫీసులో గుండె పోటు వచ్చింది. ఆఫీసులో వాళ్ళు హుటాహుటిగా కలిసి జీపులో ఆస్పత్రికి తీసుకెళుతుంటే మార్గమధ్యంలోనే కన్ను మూశాడు. ఆ జీపులోనే శవాన్ని ఇంటికి చేర్చి వరండాలో పడుకోబెట్టారు.

ఆడుతూ పాడుతూ హుషారుగా ఉదయం ఆఫీసుకు వెళ్ళిన భర్త శవమై అలా తీసుకు రాబడుతుందని అతని భార్య ఎలా వూహించ గలదు? షాక్... ఏడుపుకూడా రానంతటి షాక్!

అంతలోనే ఆమెకు మరో సమస్య ఎదురయింది!

ఇంటి యజమాని శవాన్ని ఆ రాత్రంతా వరండాలో ఉంచటానికి ససేమిరా వీల్లేదన్నాడు. చీకటి పడేలోగా శవానికి దహన సంస్కారాలు జరిపిస్తే?...

భర్త శవాన్నయినా తనివితీరా చూసుకోకుండా, మనసారా ఏడ్చుకునే వీలన్నా లేకుండా, తన వాళ్ళంటూ ఆత్మబంధువులు ఎవరూ లేకుండా శవ దహనమా? హరి భగవంతుడా? ఎంత దుస్థితి?

ఆఫీసు వాళ్ళు ఇంటి యజమానికి నచ్చ చెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆకాశం ఏ క్షణంలోనైనా కుంభవృష్టి కురుస్తానని మెరుస్తూ జడిపిస్తూంది.

లక్ష్మీపతికి ఆ ఇంటి యజమానితో ముఖపరిచయం ఉంది. అందుచేత నడుం బిగించి ముందుకు వెళ్ళాడు.

"మీరింతమంది ఇన్ని విధాలుగా చెప్పనక్కర్లేదు మాస్టారూ. నేనూ పిల్లలు గల వాడినే. ఆ ఆడమనిషి బాధ నేను అర్థం చేసుకోగలను. సానుభూతి చూపగలను. కానీ నా భార్య హై బ్లడ్ ప్రెషర్ పేషెంట్. రాత్రంతా శవాన్ని ఇంట్లో ఉంచితే గిట్టని వాళ్ళు రేపొద్దున 'దయ్యాలు, భూతాలు' అని లక్ష పుకార్లు పుట్టిస్తారు. అద్దె మీద గంపెడు సంసారం లాక్కొస్తున్న వాడిని—నా నోట్లో మన్ను కొట్టుకో మంటారా? పోనీ ఇక్కడ ఇంతమంది ఉన్నారు. ఈ రాత్రికి శవంతోపాటు వాళ్ళకు ఇంత ఆశ్రయం ఇవ్వకూడదూ?"

లక్ష్మీపతి బిక్కచచ్చిపోయాడు. సొంత ఇల్లు ఉంటే అలాగే చేయవచ్చు. తనకు లేదాయె!

మిగతా వారి వైపు చూశాడు. ఎవరికి వారు తమకు పట్టనట్లు మొహాలు తిప్పుకున్నారు.

ఎవరి భయాలు, బాధలు వారివి. ఎవరిని నిందించి ఏం లాభం?

మొత్తంమీద లక్ష్మీపతి యజమానిని బతిమలాడి ఒక పద్ధతికి అంగీకరింప చేశాడు.

దారిన పోతున్న విద్యార్థులకి పురమాయించి ఆ కాంపౌండ్‌లో పెద్ద చెట్టు పక్కన షామియానా వేయించాడు. భార్యను పిలిపించి ఇద్దరూ రాత్రంతా శవ జాగారం చేశారు.

ఇవాళ ప్రమాణ స్వీకారం చేసి ఎన్నెన్నో చేస్తానన్న ముఖ్యమంత్రి మరునాడు రాజీనామా చేసిన చందంగా మబ్బులు తేలిపోయాయి. వర్షం బొట్టు పడలేదు.

మరునాటి ఉదయానికల్లా మృతుడి బంధుగణం దిగింది.

లక్ష్మీపతి భార్యను ఇంటికి పంపించేసి తాను మాత్రం శవ సంస్కారాలన్నీ ముగిశాక ఇల్లు చేరుకున్నాడు.

"అరుంధతీ! పాపం, వాళ్ళ అద్దె ఇంట్లో నిన్నటి రోజున పడ్డ అవస్థ చూశావుగా? దేహాలు శాశ్వతమా? ఏ క్షణంలో ఏ చిలక కాస్తా ఎగిరి పోతుందో! మన కంటూ ఒక స్వంత ఇల్లు ఉండటం మంచిది కదూ?" భార్య ఇచ్చిన కాఫీ తాపీగా ఆలోచనగా అన్నాడు లక్ష్మీపతి.

అనటమేమిటి? ఆ రోజు నుంచే ఆ ప్రయత్నంలో పడ్డాడు.

నెల రోజుల తరవాత 'లోన్' ఏదో తీసుకుని వూరికి దూరంగా ఒక ప్లాట్

కొన్నాడుకూడా.

ఇదంతా జరిగి పదమూడేళ్ళయింది.

• • •

ఈ పదమూడేళ్ళలో ప్రభుత్వ కళాశాల లెక్చరర్‌గా ఆరను ఆయిదూళ్ళు తిరిగాడు. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. వాళ్ళ చదువు సంధ్యలు, పెళ్ళిళ్ళు పేరంటాలు. .జీవితం లతడిని వూపిరి పీల్చుకోనివ్వలేదు. వర్తమానాన్ని తప్పించి భవిష్యత్తును గురించి ఆలోచించే వ్యవధి లేకపోయింది. బతుకును గురించి లప్ప మృత్యువును గురించి యోచించే అవసరం కాని, సందర్భం కాని తటస్థపడలేదు మళ్ళీ.

అయినా మనసులో ఎక్కడో ఒక్కటే ఒక్క కోరిక పూర్తిగా నిద్ర పోతూ, మధ్య మధ్య లేచి అతడికి తనని గుర్తు చేసుకునేది. ఇల్లు కట్టాలన్నదే ఆ కోరిక! అదీ ఎక్కడ? తన సొంత వూళ్ళో! తను కొన్న స్థలంలో!

రిటైరవ్వటానికి ఇంక అయిదేళ్ళు ఉందనగా, ప్రభుత్వం వారు దయతలిచి అతడిని తన స్వగ్రామానికి బదిలీ చేశారు. ఎంత అదృష్టం!


లక్ష్మీనపతికి చిన్నతనం నుంచి తను పుట్టి పెరిగిన వూరంటే ఎక్కడలేని మమకారం. అక్కడ గాలి, నీరు, నేల— అన్నీ అతనికి ప్రేమపాత్రాలే!

"ఆస్తా పాస్తా? కొంపా గోడా? పేరా పలుకుబడా? నీకా వూళ్ళో ఏంఉన్నాయని ఆ వూరంటే నీ కంత మమకారమయ్యా! వట్టి చాదస్తుడులాగున్నావే! మనకి ఏ వూరు ఇంత అన్నం పెట్టి ఆశ్రయమిస్తే అదే మనవూరు అనుకోవాలయ్యా. ఇలాంటి పిచ్చి సెంటిమెంట్లు పెట్టుకుంటే ఈ రోజుల్లో బతుకు రథాన్ని ఈడ్చటం కష్టం. తెలుసా?" తోటి లెక్చరర్లు అతను తన వూరి గొప్పను చెప్పుకుంటుంటే ఎగతాళి చేసేవారు. కాని లక్ష్మీనపతికి వారి అభిప్రాయాలు నచ్చేవి కావు.

ఇవాళ వూరి విషయంలో అలా అన్నవారు రేపు దేశం విషయంలోనూ ఆ మాటే అనరా? ఆస్తుల కోసం, పలుకుబడి కోసం దేశాన్ని తాకట్టు పెట్టరా? జననీ జన్మభూమి...వీటిని ప్రేమించటానికి ఇల్లూ, ఆస్తులు కొలమానాలా? ఎంత స్వార్థదృష్టి!

లక్ష్మీనపతి సొంత వూరికి వచ్చిన దగ్గర నుంచి ఇల్లు కట్టే ఆలోచనలో పడ్డాడు. ఆ ఇంటి వైపు పోయినప్పుడల్లా పదమూడేళ్ళ క్రితం నాటి ఆ దృశ్యం కళ్ళ ముందు మెదిలేది.

పదమూడేళ్ళ క్రితం అతను ప్లాటు




కొన్న వైపు ఆ రోజుల్లో అంతా అనుకున్నట్లు వూరు విస్తరించ లేదు. అకస్మాత్తుగా పెరుగుదలను ఇంకో వైపు తిప్పారట. రాజకీయాల వల్ల అసలు వూరు అభివృద్ధి చెందాల్సిన మేరకు పెరగలేదట! మళ్ళీ ఇప్పుడు అటు పెరుగుతుందట!

'ఈ రాజకీయాలు మనిషిని ఎటు తీసుకెళుతున్నాయో?' అనుకుని విచారించాడు లక్ష్మీనపతి—కథలన్నీ విని.

అతని ప్లాటుకు చుట్టు పక్కల చెదురు మదురుగా కొన్ని ఇళ్ళు వెలిశాయి. బావి తవ్వితే నీళ్ళు పడుతున్నాయి. మట్టి రోడ్లు ఉన్నాయి. విద్యుత్ సౌకర్యం ఉంది. అయితే ఆ ఇళ్ళు వూరికి దూరంగా విసిరి వేయబడ్డట్లు ఉన్నాయి.

అయితేనేం? చల్లటి గాలి. ఆహ్లాదకరమైన నిశ్శబ్దం. అందమైన ప్రకృతి. ముసలితనంలో జీవితపు పరుగులకు, భీకర శబ్దాలకు దూరంగా, హాయిగా, ప్రశాంతంగా గడపటం కన్నా అదృష్టం ఏముంది?

"ఏమండీ! ఒక్క సలహా ఇవ్వనా? ఇల్లు కాస్త ఖర్చయినా-అందంగా, ఆధునికంగా కట్టండి." అరుంధతి సలహా.

"వూఁ. ముసలితనంలో నీకూ ఫాషన్స్ కావలిసి వచ్చాయే?"

"ఇల్లు కట్టుకుంటున్నది కేవలం మన కోసం కాదు కదండీ. మన పిల్లలు మన లాంటి చాందసులు కారుగా? వారి అభిరుచులు దృష్టిలో పెట్టుకోవద్దూ?"

"సహధర్మచారిణి అంటే నీ లాగా ఉండాలి, అరుంధతీ. నా మనసులోని ఆలోచనే నీవు చెప్పావు."

లక్ష్మీనపతికి ఇద్దరు మగ పిల్లలు., ఒక ఆడపిల్ల. పెద్దవాడు ఓ.ఎన్.జి.సి.లో ఎక్కడో అస్సాంలో పని చేస్తున్నాడు. కూతురూ, అల్లుడూ ఢిల్లీలో ఉన్నారు. చివరివాడు ఇంజనీరింగ్ చివరి సంవత్సరంలోకి వచ్చాడు.

"ఏమండీ! చిన్నవాడైనా మనవూళ్ళో ఉంటాడా? ఇక్కడ ఉద్యోగం చిక్కుతుందా?" అరుంధతి భర్తనో రోజు అడిగింది. అప్పటికి ఇల్లు సగం కట్టబడి అయింది.

"ఏమో? ఎవరికి ఏ గాలీ, నీరూ ప్రాప్తమో! ఎవరు చూసొచ్చారు?"

"వాడుకూడా ఇక్కడ ఉండని కాడికి ఇంత పెద్ద ఇల్లు ఎవరి కోసమండీ?"

"ఏం? మనం అనుభవించకూడదూ? పిచ్చిదానా! ఆశతోనే మనిషి ఏదైనా చేస్తాడే? ఫలాఫలాలు దైవసంకల్పంమీద, మానవ ప్రయత్నం మీద ఆధారపడి ఉంటాయి. ఈ ఇల్లు మనం ఉన్నంత వరకు మన అనుభవం కోసం. మన తరవాత మన వారసుల కోసం. ఆ పైన దైవేచ్ఛ ఎలా ఉందో?"

ఇల్లు పూర్తయింది. బ్రహ్మాండంగా ఉందన్నా రంతా.

'లెక్చరర్ ఉద్యోగంలో లంచాలు ఉండవంటారే! మరి ఇంత డబ్బు లక్ష్మీనపతి ఎలా సంపాదించాడో? ఎంత సంపాదించక పోతే అద్దెలకి డిమాండు లేని ఈ వూళ్ళో, అందులోనూ వూరి చివర, అంత గొప్ప రాజసౌధం నిర్మిస్తాడు!'

తన వూరి పైన మమకారంతో, భవిష్యత్తు పైన ఆశతో కూడబెట్టిన డబ్బు, ప్రభుత్వంవద్ద తీసుకున్న 'లోను' సరిపోకపోతే, కట్టబోయే ఇల్లునే కుదవ పెట్టి బాంక్‌లో అప్పు తీసుకుని ఇల్లు పూర్తి చేశానని లక్ష్మీనపతి ఎలా చెప్పుకోగలడు?

గృహప్రవేశాని కొచ్చిన కొడుకులు, కూతురు ఆ ఇల్లు చూచి ఆనందంతో గంతులు వెయ్యలేదు.

"ఈ వూళ్ళో ఇంత పెద్ద బంగళా ఎందుకు, నాన్నా? బెస్ట్. సిటీలో ఇళ్ళ మీద 'ఇన్‌వెస్ట్'చేస్తే ప్రాఫిట్ గానీ..."

లక్ష్మీనపతి మనస్సు చివుక్కు మంది!

సొంత వూళ్ళో సుఖంగా ఉండటానికి, ఇల్లు కట్టుకోటానిక్కూడా ఇన్‌వెస్ట్‌మెంట్‌లు, ప్రాఫిట్‌లు అంటూ వ్యాపార దోరణేనా? మనిషి అనుభూతులకీ, తృప్తికీ, విశ్వాసాలకీ, ఆదర్శాలకీ అసలు విలువ లేదా? ఆ విలువను వెల గట్టే సాధనా లేమిటో?

"ఈ వూరూ అభివృద్ధి అవుతుందట లేరా? ఎవరో పెద్ద ఫ్యాక్టరీ కడుతున్నారట! మాతృభూమిని మరీ అంత చులకనగా చూడకండి."

• • •

లక్ష్మీనపతి రెండో కొడుకు ఇంజనీరింగ్ పూర్తయింది. అదే సమయంలో ఆ వూళ్ళో పెద్ద ఫాక్టరీ స్థాపనకూడా జరుగుతూంది. అక్కడే ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తే...

"నేను ఇంజనీరింగ్ 'రాంక్' స్టూడెంట్‌ని నాన్నా? ఉద్యోగం కోసం ప్రయత్నం చేసే అవసరం నాకేమిటి? అవే నన్ను వెతుక్కుంటూ వస్తాయి. చూస్తారుగా?"

ఎన్నో కంపెనీల వారితో పాటు ఆవూరు ఫాక్టరీ వాళ్ళుకూడా అతన్ని వెతుక్కుంటూనే వచ్చారు. లక్ష్మీనపతి అరుంధతికి అతను ఆవూళ్ళో చేరాలని ఉంది. కానీ అతను బొంబాయిలో ఒక పెద్ద కంపెనీని 'ప్రిఫర్' చేశాడు

"బొంబాయిలోకూడా కొన్నాళ్ళే. నాన్నా. త్వరలో నాకు ఫారిన్ ఛాన్సు రావచ్చు."

ఉద్యోగంలో చేరాక బొంబాయిలోనే పిల్లను ఎన్నుకున్నాడు కొడుకు.

"కోడల్ని తీసుకుని ఇంటికి రారా ఒక సారి."

"ట్రై చేస్తా, నాన్నా."

సెనగలు తిని చేతులు కడుక్కున్న చందమయింది లక్ష్మీనపతి స్థితి!

• • •


లక్ష్మీనపతి రిటైరయ్యాడు. గ్రాట్యుయిటీ, ప్రావిడెంట్ ఫండ్ ఇల్లు కట్టటానికి చేసిన అప్పులకి సరిపోయింది. మిగిలింది ఇల్లు... పెన్షన్ డబ్బులు.

లంకంత ఇల్లు. వెక్కిరిస్తున్నట్లు అందులో ఇద్దరు!

"పోనీ ఒక పోర్షన్ అద్దె కిస్తే?"

అద్దెలకి అంత దూరం ఎవరూ రారు. వచ్చినా పదీ పరకాకు అడుగుతారు.

ఇంటి ఆవరణలో స్వయంగా మట్టి తవ్వి, మొక్కలు వేసి గార్డెన్ పెంచాడు లక్ష్మీనపతి. ఆ గార్డెన్ ఆ దంపతులకి




ప్రాణం.

ఆ రోజు తోటలో పని చేస్తున్న భర్తను భోజనానికి కేక వేసింది అరుంధతి. ఎంతకూ బదుల్లేకపోతే ఆమే ఆయన వద్ద కెళ్ళింది.

ఆయన మట్టిని గుప్పెట్లో పెట్టుకుని తదేకంగా చూస్తున్నాడు.

"అరుంధతీ! మట్టిలో జీవధాతువు లున్నాయి. ప్రాణశక్తి ఉంది. మట్టిని, మనిషిని బంధించే సూత్రం ఆ జీవశక్తే కదూ? మట్టిలేని మనిషిని, మనిషి లేని మట్టిని వూహించటం కష్టంకదూ? మట్టిని ప్రేమించ లేని వాడు మనిషిని, మనిషిని ప్రేమించలేని వాడు మట్టిని ప్రేమించలేడు. అవును కదూ?"

"ఏమిటండీ ఈ దోరణి? భోజనానికి రండి."

"ఈ మట్టిని ప్రేమించట తప్పా, అరుంధతీ?"

"కాదండీ. మీ ప్రేమను అర్థం చేసుకోలేని వారిది తప్పు!"

"కానీ ఇంత పెద్ద ఇల్లు కట్టి పొరపాటు చేసేమేమో కదూ?"

ఇద్దరి మనస్సుల్లోని దిగులు అదే! ఒకనాడు ఆ ఇల్లును చూసుకుని మురిసి పోయిన ఆ దంపతులకు ఇప్పుడా ఇల్లు పెద్ద ప్రాణసంకట మయింది!

అద్దె కిద్దామంటే ఎవరూ రారు. అద్దెకు ఇవ్వకపోతే ఇల్లు గడిచే పరిస్థితి లేదు. ఉండటానికి ఇల్లు ఉండగానే సరా! తినటానికి తిండి?

పైగా అంత ఇల్లును శుభ్రంగా ఉంచాలంటే పనిమనుషులు ఉండాలి. ఎక్కడి నుంచి వస్తారు? గార్డెన్‌లో పూర్వంలా పనిచేసే శక్తి పోయింది లక్ష్మీపతికి.

పూర్వం చిన్న కొడుకు ఏ నాటికైనా వస్తాడన్న ఆశ ఉండేది. ఇప్పుడు అతను అమెరికా వెళ్ళిపోయాడు. ఎవరిని డబ్బు కోసం యాచించటం?

క్రమంగా గార్డెన్‌లో మొక్కలు వాడి పోసాగాయి. ఇంట్లో సాలెగూడులు స్థిర నివాసాలు ఏర్పరుచుకో సాగాయి.

"పోనీ మనం ఒక పోర్షన్‌లో ఉండి, మరో పోర్షన్ అమ్మేస్తే?"

ఆ ప్రయత్నమూ అయింది. సగం పోర్షను కొనటానికి ఎవరూ రాలేదు.

పోనీ మొత్తం ఇల్లు అమ్మి పారేస్తే?

అమ్మో! భర్త శవం...భార్య గోడు... ఆ దృశ్యం...

తను పోతే అరుంధతిని అద్దెవాళ్ళు అలాగే నెట్టేయరూ? పైగా ఇంత కష్టపడి ఇల్లు కట్టుకుని పరాయి పంచలో చావడమా? కాగా తన సంతతికి తను ఇవ్వగలిగింది ఈ ఇల్లేగా?

"తన కింత సొంత కొంపా గూడూ ఉండాలన్న తపన మనిషికి అనాదిగా ఉంది అరుంధతీ. ఆ తపన వయసులో ఉండగా కలగదు. రాలిపోతామన్న భయం ఉన్న ఆకులకే చెట్టుకు అంటి పెట్టుకుని ఉండాలన్న తపన!"

ఆ తపన తీరకే చాలా కాలం ఇల్లు చూస్తూ కడుపు నింపుకున్నారు.

కానీ చివరికి కొడుకుల నుంచి అడిగినా సాయం రాకపోవటంతో లక్ష్మీపతికి బాధ వేసింది. కోపం వచ్చింది.

"ఈ ఇల్లు తెగనమ్మి ఆ డబ్బు బాంకులో వేసుకుని బతకగలం, అరుంధతీ. కావాలంటే మరో చిన్న ఇల్లు కొనుక్కుందాం. మనకేం? ఏమనుకున్నారో వెధవలు?"

అమ్మబోతే అతను ఆశించిన రేటు పలక లేదు ఇంటికి. అప్పుడు వూరు ఉత్తరానికి విస్తరిస్తున్నది. దక్షిణాన ఉన్న ఆ ఇల్లును ఎవరు కొంటారు?

అయినకాడికి అమ్మక చేసే దేముంది?

సొంత ఇంటిని ముసలితనంలో పరహస్తం చేసి, ఆ రెండు ముసలి ప్రాణాలు ఆఖరి మజిలీని అన్వేషిస్తూ అద్దె కొంపకు బయలు దేరాయి.

తోటలో నడుస్తుండగా అరుంధతి వంగింది.

"ఏమిటి?"

"అబ్బే! ఏం లేదు. వేలి మెట్టె జారుతున్నట్లుంటేనూ?"

ఆమెను ముందుకు నడవనిచ్చి లక్ష్మీపతి వంగాడు. అదే ప్రశ్న!

"అదే...జేబులోనుంచి పావలా బిళ్ళ జారి పడినట్లుంటేనూ..."

ఇద్దరి చేతుల్లో గుప్పెడు మట్టి! ఇద్దరి కళ్ళలో కన్నీటి కడవలు!

• • •

మరో అయిదేళ్ళలో వూరు దక్షిణం వైపు విపరీతంగా పెరిగిపోయింది. ఒకప్పటి లక్ష్మీపతి ఇల్లు ఇప్పుడు బిజినెస్ సెంటర్! ఇంటికి చుట్టూ ఉన్న ఆవరణలో ఎన్నో షాపింగ్ కాంప్లెక్స్‌లు వెలిసేయి. గేటులో నుంచి ఇల్లు కనపడదు. ప్రవేశ ద్వారానికి ఎడమ వైపు చిన్న తోట ఎండిపోతూ ఇంకా ఉంది!

ఇప్పటి ఆ ఇంటి ఆకర్షణ ... ఆదాయం!

కానీ ఆ నాటి ఇంటి అందం— ప్రశాంతత లేవీ?

లక్ష్మీపతి రోజూ ప్రొద్దునా, సాయంత్రం ఒకసారి ఆ ఇంటివైపు వెళ్ళి చూసి రావాల్సిందే. ఆ మార్పూ, ఆ అభివృద్ధి చూస్తుంటే ఏదో బాధ!

"తెగిపోయిన ఋణానుబంధం, మమకారం పెంచుకోకండీ ఇంకా."

"ఇల్లు అమ్మటంలో తొందరపడ్డానేమో కదూ?"

"ఫలాఫలాలు దైవ సంకల్పం మీద ఆధారపడి ఉంటాయని మీరే కదండీ చెప్పేరు! మీకు తెలీదేమో—వూరు దక్షిణం వైపుకు పెరగటానికి కారణం మనం ఇల్లు అమ్మటమేగా? ఆ ఇల్లు కొన్నాయన చాలా పలుకుబడి ఉన్న వాడటగా?"

ఆ ముసలితనంలో ఒకరి కొకరు ఓదార్పు...మానసిక అండ!

కొన్నాళ్ళకు లక్ష్మీపతికి ఆ అండా పోయింది. ఏ బాధా లేకుండా అరుంధతి భర్త చేతుల్లో ప్రశాంతంగా, అనాయాసంగా కళ్ళు మూసింది.

లక్ష్మీపతి శవాన్ని బయటికి తరలించబోయాడు.

"భలేవారే! పుణ్యాత్మురాలు. పుని స్త్రీగా చనిపోయింది. ఆ ఉత్తమ ఇల్లాలు బతికున్నంత కాలం మాకు తలలో నాలుకలా ఉంది. కన్ను మూసిందని వీధిపాలు చేస్తామా?" అంటూ అద్దె ఇంటి యజమానులు, చుట్టుపక్కల వాళ్ళు అంతా చేరి ఆమెకు ఘనంగా దహన సంస్కారాలు జరిపించారు.

భార్య పోయాక లక్ష్మీపతి కొన్నాళ్ళు గడప దాటలేదు. కూతురు, కొడుకు.. అందరూ అతడిని తమ దగ్గరకు రమ్మన్న వారే. ఇక్కడికి రమ్మంటే "అక్కడేముంది, నాన్నా...మట్టి" అన్నవారే!

మనో వ్యథ...ఒంటరితనం!

క్షణంలో పండు వృద్ధులా తయారయ్యాడు... నీరసించిపోయాడు.

"బాబుగారూ! ఇక్కడ ఒంటరిగా ఉంటే మీ ఆరోగ్యం చెడిపోయేలా ఉంది. పోనీ కొంతకాలం మీ కొడుకు దగ్గరకో, కూతురి దగ్గరకో ... అహా... గాలి మార్పుగా ఉంటుంది కదా అని..."

గాలి మార్పు సంగ తెలా ఉన్నా, తనకు ఇంటి మార్పు అవసరం అని గ్రహించాడు లక్ష్మీపతి.

ఒక చిన్న గది ఎక్కడో ఖాళీగా ఉందని చెప్పే రెవరో. తీరా వెళ్ళి చూస్తే అది తను స్వయంగా కట్టిన ఇంట్లోనే!

చిన్న గార్డెన్‌ను కూడా పీకి పారేసి ఇంటి యజమానులు చిన్న చిన్న గదులు కట్టి అద్దె కిస్తున్నారు.

ఆ గది దొరికితే ఎంత అదృష్టం? తన ఇంట్లోనే శేష జీవితాన్ని గడిపేయ వచ్చు.

ఎన్నో ఏళ్ళ తర్వాత ఒకప్పటి తన ఇంట్లోనే ఒక గదిని అద్దె కిమ్మని అడగ డానికి ఆ ఇంట్లోకి అడుగు పెడుతుంటే లక్ష్మీపతి తనువు పులకించింది.

"అవి షాపులకు కట్టిన గదులండీ. మీ రెలాగ ఉంటారు? పైగా ఒంటరిగా ఉంటా మంటున్నారు. చూడబోతే మీ ఆరోగ్యం బాగున్నట్లు లేదు. పైగా వార్ధక్యం. రేపు మీకేమన్నా అయితే?"

మనసు మీద చెర్నాకోలు పెట్టి ఛళ్ళున కొట్టినట్లయింది లక్ష్మీపతికి. ఏమో చెప్పబోయాడు.

"మా కెందు కొచ్చిన గొడవలు— చెప్పండి! సారీ... మీకు అద్దె కివ్వను"

లక్ష్మీపతి గుండె బరువెక్కింది. కళ్ళు గిరిగిరా తిరిగేయి. బయటికి భారంగా నడుస్తున్నాడు. మెల్లగా అడుగు తీసి అడుగు వేస్తూ గేటును సమీపిస్తున్నాడు. అతని చూపు నేల మీదే ఉంది.

ఏదీ నేల! నేలమీద మట్టి ఏది? అంతా కంకర మయం—సిమెంటు పూత!

అకస్మాత్తుగా అతని దృష్టి ఒకచోట నిలిచిపోయింది.

అక్కడ ఇంకా ఒక ఎండిపోయిన చెట్టు అలా నిలబడే ఉంది.

చెట్టు మొదట్లో మట్టి!

లక్ష్మీపతి కళ్ళు తళతళ మెరిసేయి. నడుం వంచేడు.

వంగిన వాడు వంగినట్లే అలా నేల మీద దభీమని పడ్డాడు.

"అరెరె! వెధవ న్యూసెన్సు! హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి."

బోర్లాపడ్డ అతడిని వెల్లకిలా పడుకోబెట్టారు. మొహం చెట్టుపాదిలో పడిందేమో—మొహమంతా మట్టి!

"వంగి ఏదో తీసేడు. ఆ గుప్పెట్లో ఏదో ఉంది—చూడండి."

లక్ష్మీపతి గుప్పెటను బలవంతంగా తెరిచా రెవరో!

అందులో ఉంది—అంత పెద్ద ఇంట్లో వెతికితే కాని దొరకని వస్తువు!

గుప్పెడు మట్టి!

ఆయన ప్రాణం ఆ మట్టిలోనే కలిసిపోయింది. ★